క్లుప్తంగా

ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల అందజేత

మద్దిపాడు: మండలంలోని 22 గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు పీహెచ్‌సీ సూపర్‌వైజర్ బాలకోటయ్య తెలిపారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా, డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఉపాధి హామీ కూలీలకు పంపిణీ చేసేందుకు ఒక్కో ఫీల్డ్ అసిస్టెంట్‌కు 50 చొప్పున ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించినట్లు ఆయన వెల్లడించారు.

కంటి ఆపరేషన్లకు 40 మంది తరలింపు


కంటి ఆపరేషన్లకు వెళ్తున్న వారితో ఆస్పత్రి సిబ్బంది

మద్దిపాడు: మండలంలో కంటి ఆపరేషన్లు అవసరమైన 40 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి గుంటూరు సమీపంలోని శంకర నేత్రాలయకు తరలించినట్లు పీహెచ్‌సీ ఓఓ జయరాజ్ తెలిపారు. ఆపరేషన్లు చేయించుకోవడానికి వెళ్తున్న 40 మందికి అల్పాహారం, వాటర్ బాటిళ్లు అందించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లలితమ్మ, నాగరాజ, పద్మ, సూపర్‌వైజర్ బాలకోటయ్య, దరియా, చిరంజీవి ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాల అందజేత

సంతనూతలపాడు: మండలంలోని రుద్రవరం గ్రామానికి చెందిన మన్నం సుబ్బారావు, తాళ్లూరి శేషారావు, సిరిగిరి కిరణ్ శుక్రవారం రాత్రి స్థానిక ఎస్సై వి.అజయ్‌బాబుకు రూ.50 వేల విలువైన సీసీ కెమెరాలు, కేబుల్, డీవీఆర్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వీరిని ఆదర్శంగా తీసుకుని ప్రతి గ్రామంలో స్థానిక నాయకులు సీసీ కెమెరాలు అందజేస్తే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డీఈవోకు సత్కారం


డీఈఓను సన్మానిస్తున్న శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో డీఈఓ కిరణ్ కుమార్‌ను శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి శాలువా, జ్ఞాపికతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సేవాసమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్‌బాబు, సాహితీవేత్తలు ఆళ్ల వెంకటేశ్వర్లు, తన్నీరు బాలాజీ, అనుముల మహేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి

- వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం ఒంగోలు మండల పరిధిలోని చింతాయగారిపాలెం, పెదదేవరంపాడు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా ఉండి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలు, సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. అనంతరం గ్రామ నాయకులతో మాట్లాడి వారి సమస్యలడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అలాగే గ్రామాల్లో కమిటీలను నియమించాలని కోరారు. నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ ఒంగోలు మండల అధ్యక్షుడు మన్నే శ్రీనివాసరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చుంచు రామకృష్ణ, నాయకుడు సుబ్బయ్య, చింతాయగారిపాలెం నాయకులు శ్రీరాములు, వెంకట సుబ్బయ్య, బాబూరావు, అమీన్, సురేష్, సుబ్రహ్మణ్యం, జగ్గారావు, గోపి, వెంకటేశ్వర్లు, చక్రపాణి, చక్రవర్తి, మస్తాన్, చెన్నయ్య, స్వాములు, పెద్దదేవరంపాడు నాయకులు వడ్లమూడి మురళి, వాసు, కరేటి వెంకటేశ్వర్లు, సుబ్బారావు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.


చింతాయగారిపాలెంలో నాయకులతో మాట్లాడుతున్న చుండూరు రవిబాబు


పెదదేవరంపాడులో మాట్లాడుతున్న చుండూరు రవిబాబు

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల మండలాధ్యక్షుల నియామకం

సంతనూతలపాడు: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, సంతనూతలపాడు ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున సంతనూతలపాడు మండల అనుబంధ విభాగాలకు నూతన అధ్యక్షులను నియమించినట్లు పార్టీ మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి తెలిపారు. మున్సిపల్ వింగ్ అధ్యక్షునిగా రావూరి శ్రీనివాసరెడ్డి, యూత్ వింగ్ అధ్యక్షునిగా కొండ్రాజు శివన్నారాయణ, మహిళా విభాగం అధ్యక్షురాలిగా మొలకలపల్లి సీతమ్మ, రైతు విభాగం అధ్యక్షునిగా మాదాల వెంకట్రావు, బీసీ సెల్ అధ్యక్షునిగా గుంజి ఏడుకొండలు, ఎస్సీ సెల్ అధ్యక్షునిగా పతకమూరి వెంకట సుబ్బయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షునిగా జగన్నాథం శ్రీనివాసరావు, మైనార్టీ సెల్ అధ్యక్షునిగా ఎస్‌కే రసూల్, స్టూడెంట్ వింగ్ అధ్యక్షునిగా గంగవరపు రిషి, వైఎస్సార్ ట్రేడింగ్ యూనియన్ అధ్యక్షునిగా కాకి రవికుమార్, వీవర్స్ విభాగం అధ్యక్షునిగా కంచు హనుమాన్‌బాబు, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షునిగా మంగపాటి శ్రీనివాసబాబు, వలంటీర్ విభాగం అధ్యక్షునిగా వీరభద్రాపురం బాలసైదులు, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలిగా జంగాల కుమారి, దివ్యాంగుల విభాగం అధ్యక్షునిగా కలం కోటేశ్వరరావు, కల్చరల్ విభాగం అధ్యక్షునిగా చిన్న అంజయ్య, ఆర్టీఐ విభాగం అధ్యక్షునిగా తేళ్ల కరుణకుమార్, వాణిజ్య విభాగం అధ్యక్షునిగా వేమూరి ప్రసన్న రాకేష్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ విభాగం అధ్యక్షునిగా రేపూరి బ్రహ్మయ్య, సోషల్ మీడియా విభాగం అధ్యక్షునిగా పాతకొట్టు గగన్‌రెడ్డి, పబ్లిసిటీ విభాగం అధ్యక్షునిగా తేళ్ల అనిల్‌కుమార్‌ను నియమించినట్లు దుంపా చెంచిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

శ్రీగిరిలో స్వామివారికి మేల్ చాట్ వస్త్రాల సమర్పణ


మేల్ చాట్ వస్త్రాలు సమర్పిస్తున్న ప్రవీణ్ కుమార్, శ్రావణి దంపతులు


లిఫ్ట్ ప్రారంభిస్తున్న శ్రీగిరి ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి

ఒంగోలు మెట్రో: స్థానిక శ్రీగిరిలో వెంకటేశ్వరస్వామివారికి శుక్రవారం ఒంగోలుకు చెందిన ప్రవీణ్ కుమార్, శ్రావణి దంపతులు మేల్ చాట్ వస్త్రాలు సమర్పించారు. ప్రవీణ్ కుమార్ దంపతులకు ఆలయ అర్చకులు, వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. శ్రీగిరి దేవస్థానానికి అనుబంధమైన శ్రీగిరి గో క్షేత్ర భవనంలో రెండు, మూడు అంతస్తులలో జరిగే ధార్మిక, శుభ కార్యక్రమాలలో పాల్గొనేందుకు విచ్చేసే వారిలో వయోవృద్ధులు, ఇతర ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి ఉపయోగపడేలా శ్రీగిరి నిర్వాహకులు లిఫ్ట్ సౌకర్యం కల్పించారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి ముఖ్యఅతిథిగా పాల్గొని లిఫ్ట్‌ను ప్రారంభించారు.

నేడు శ్రీగిరిలో వసంతోత్సవం...

శ్రీగిరి వెంకటేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో శనివారం శ్రీవారికి వసంతోత్సవం నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ధర్మకర్తల మండలి ప్రతినిధులు వెల్లడించారు. ఉదయం శ్రీవారికి సహస్ర నామార్చన, విశేష స్నపన తిరుమంజనం, సాయంత్రం శ్రీవారికి వసంతోత్సవం, ఊంజల సేవతో పాటు ప్రముఖ గాయకులు దివంగత గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ స్మృత్యర్థం నివాళి కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. బొల్లాపల్లి వెంకట ఫణిదీప్తి బృందం అన్నమయ్య సంకీర్తనల ఆలాపనతో బాలకృష్ణ ప్రసాద్‌కు నివాళి ఘటిస్తారని చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు కోరారు.

క్రీస్తు మార్గం ఆదర్శనీయం


ఈతముక్కలలో శిలువ యాత్ర నిర్వహిస్తున్న పాస్టర్లు, క్రైస్తవులు

- ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

మద్దిపాడు: ప్రేమ, కరుణ కలిగి ఉండాలన్న క్రీస్తు మార్గం ఆదర్శనీయమని మద్దిపాడు విలియం కేరీ చర్చి పాస్టర్ రెవరెండ్ రెబ్బవరపు అబ్రహం అన్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం స్థానిక చర్చిలో క్రైస్తవులనుద్దేశించి ఆయన మాట్లాడారు. శాంతియుత సమాజం కోసం తన సన్మార్గ జీవితాన్ని మానవ జాతికి తెలపడం కోసం క్రీస్తు శిలువపై రక్తాన్ని చిందించారని తెలిపారు. ఆయన జీవితాన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న చర్చిలలో గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం నుంచి ఉపవాసం ఉండి చర్చిలకు చేరుకున్న క్రైస్తవులకు శిలువపై ఏసుక్రీస్తు మాట్లాడిన ఏడు మాటల గురించి వివరించారు. తోటి వారితో ప్రేమగా మసలుకోవాలని పాస్టర్లు తెలియజేశారు.

చీమకుర్తి మండలంలో...

చీమకుర్తి రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులంతా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని మంచికలపాడు, చీమలమర్రి గ్రామాల్లోని చర్చిలలో గుడ్ ఫ్రైడే సందర్భంగా విశ్వాసులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు జరిపారు. పాస్టర్లు మాగులూరి పురుషోత్తం, గద్దల దేవసహాయం ఏసుక్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటలు గురించి వివరించారు.

కొత్తపట్నం మండలంలో...

కొత్తపట్నం: మండలంలో శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రార్థనా మందిరాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గుడ్ ఫ్రైడే విశిష్టత గురించి వివరించారు. ఈతముక్కల గ్రామంలో శిలువ లాగుతూ ప్రార్థనలు చేశారు. ప్రతి ఏడాది ఈతముక్కల గ్రామంలో గుడ్ ఫ్రైడే రోజు శిలువ లాగుతూ ప్రార్థనలు చేయడం, మండలం నలుమూలల నుంచి, జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి క్రైస్తవులు వచ్చి పాల్గొనడం ఆనవాయితీ. అందులో భాగంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈతముక్కల గ్రామంలోని ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో శిలువను భుజానికి ఎత్తుకుని అంబేడ్కర్ కాలనీ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు శిలువ యాత్ర నిర్వహించారు. ప్రార్థనలు చేస్తూ క్రీస్తు గీతాలు ఆలపించారు. అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొనగా, రెవరెండ్ ఫాదర్ విసుసెంట్, సంఘ కాపరి సుధాకర్‌రావు, పెద్దలు, సంఘస్తులు హాజరయ్యారు.

అత్తవారి నుంచి రక్షణ కల్పించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అపర్ణ

ఒంగోలు టౌన్: అత్తింటి వారి నుంచి తనకు ప్రాణ భయం ఉందని, తనకు రక్షణ కల్పించాలని మండవ అపర్ణ కోరారు. శుక్రవారం స్థానిక హౌసింగ్ బోర్డులోని మహిళాభ్యుదయ సమితి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి తనకు జరిగిన అన్యాయాన్ని ఆమె వివరించారు. మండవవారిపాలెం గ్రామానికి చెందిన మండవ రామకృష్ణ అనే వ్యక్తితో మూడేళ్ల క్రితం వివాహం జరిగిందని తెలిపారు. అతడి మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో తన పెదనాన్న రామ్మోహనరావు మాటలు వింటూ వేధిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్తి మీద కన్నేసిన రామ్మోహనరావు.. తనకు, తన భర్తకు మధ్య తగాదాలు సృష్టిస్తున్నాడని తెలిపారు. అంతేగాకుండా తనపై, తన తల్లిదండ్రులపై అనేక సార్లు దాడి చేసి గాయపరిచినట్లు తెలిపారు. ఈ విషయంపై ఒంగోలులోని తాలూకా పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పటికీ ఎఫ్ఐఆర్ నమోదు చేసి తదుపరి చర్యలేమీ తీసుకోలేదని చెప్పారు. ఎస్పీకి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని వాపోయారు. అత్తవారి కుటుంబం నుంచి తనకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మహిళాభ్యుదయ సమితి రాష్ట్ర అధ్యక్షురాలు తేళ్ల అరుణ మాట్లాడుతూ పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, మండవ అపర్ణకు న్యాయం జరిగేంత వరకు అండగా నిలబడతామని చెప్పారు. విలేకరుల సమావేశంలో బీరం అరుణ, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై కార్మికులకు అవగాహన అవసరం


కార్మికులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి శ్రీకాంత్‌రెడ్డి

ఒంగోలు టౌన్: పరిశ్రమలలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు కార్మికులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా తెలివిగా వ్యవహరించాలని జిల్లా అగ్నిమాపక అధికారి కె.శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం స్థానిక యరజర్ల రోడ్డులో చెరువుకొమ్ముపాలెంలోని భగీరథ కెమికల్స్ ఇండస్ట్రీస్‌లో కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు పొగ పీల్చుకుని స్పృహ తప్పి పడిపోయిన వారికి వెంటనే ప్రథమ చికిత్స చేయాలని చెప్పారు. అనంతరం ఫ్యాక్టరీలోని అగ్నిమాపక పరికరాలు పనిచేసే విధానాన్ని కార్మికులకు వివరించారు. అలాగే నివాస గృహాల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అగ్నిమాపక కేంద్రంలోని రెస్క్యూ పరికరాల ఉపయోగాలు, పనితీరుపై డెమో ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ జిల్లా సహాయ అధికారి శ్రీనివాసులరెడ్డి, కంపెనీ ఎండీ చంద్రశేఖర్, జీఎం సీహెచ్ శ్రీనివాసరావు, ఎల్.వెంకటరామయ్య, కె.హరిబాబు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు జన్మించిన స్థలాన్ని ఇవ్వమని ఒత్తిళ్లు

- అమరజీవి పొట్టి శ్రీరాములు అభిమాన సంఘ అధ్యక్షుడు నాగాంజనేయులు

ఒంగోలు టౌన్: అమరజీవి పొట్టి శ్రీరాములు జన్మించిన పడమటిపల్లి గ్రామంలోని స్థలాన్ని గుడి నిర్మించేందుకు తాము కొనుగోలు చేశామని, కానీ, ఆ స్థలాన్ని అప్పగించాలని కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి అనుచరుడు కొలిపర్తి మారుతి ఒత్తిడి తీసుకొస్తున్నాడని అమరజీవి పొట్టి శ్రీరాములు అభిమాన సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు పేరకం నాగాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ స్థలాన్ని తమకు అప్పగిస్తే ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొచ్చి స్మారక భవనం నిర్మిస్తామని చెబుతున్నారని తెలిపారు. అయితే, తాము పొట్టి శ్రీరాములు మీద అభిమానంతో 416 మంది దాతల సహకారంతో ఆ స్థలాన్ని కొనుగోలు చేశామని వివరించారు. పొట్టి శ్రీరాములు గుడి నిర్మించేందుకు ఈ ఏడాది మార్చి 16వ తేదీ భూమి పూజ చేసినట్లు తెలిపారు. అందులో మూడంతస్తుల భవనాన్ని నిర్మించి దానిపైన 28 అడుగుల ఎత్తయిన పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. కింది అంతస్తులో అయోధ్యలోని బాల శ్రీరాముల వారి విగ్రహం తరహాలో పొట్టి శ్రీరాములు 8 ఏళ్ల వయసులో ఉన్నప్పటి విగ్రహం, ఆ తర్వాత అంతస్తులో శ్రీరాములు కుటుంబ సభ్యుల విగ్రహాలు, మూడో అంతస్తులో ఆర్యవైశ్యుల కులదైవం వాసవీ మాత విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అయితే, ఇప్పుడు ఆ స్థలంలో స్మారక గృహాన్ని నిర్మిస్తామని ఒత్తిళ్లు చేయడం బాధ కలిగిస్తోందన్నారు. స్థలాన్ని మాకు అప్పగించకుంటే మీరు ఆ స్థలంలో అడుగు పెట్టలేరని, ఒక ఇటుక కూడా పేర్చలేరని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పొట్టి శ్రీరాములు జన్మస్థలాన్ని సందర్శించిన కనిగిరి ఎమ్మెల్యే.. ఆ స్థలంలో అడుగు పెట్టిన వారిని అరెస్టు చేయాలని ఆదేశాలిచ్చినట్లు ప్రచారం జరుగుతోందని తెలిపారు. తాము పొట్టి శ్రీరాములు మీద అభిమానంతోనే స్థలం కొనుగోలు చేశామని, వ్యాపార దృక్పథంతో కొనుగోలు చేయలేదని అన్నారు. పడమటిపల్లిలో శ్రీరాములు గుడి నిర్మాణానికి ప్రభుత్వం తమకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఎంఆర్‌పీఎస్ మండల మాజీ అధ్యక్షుడు మృతి

చీమకుర్తి రూరల్: మండలంలోని ముప్పవారిపాలెం గ్రామానికి చెందిన ఎంఆర్‌పీఎస్ మండల మాజీ అధ్యక్షుడు బక్కా నాగభూషణం శుక్రవారం మృతి చెందారు. ఆయన భౌతిక కాయానికి పలువురు నాయకులు నివాళులర్పించారు. కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, బక్కా రత్నం, పాస్టర్ బక్కా యాకోబు, బక్కా కోటేశ్వరరావు, బక్కా కోటిలింగం, తదితరులు నివాళులర్పించారు.


నివాళులర్పిస్తున్న నాయకులు

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు


పోలేరమ్మకు పూజలు చేస్తున్న భక్తులు


రథోత్సవంలో బారులుదీరిన మహిళలు

మదనూరు (కొత్తపట్నం): పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా మడనూరు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచన, పంచగవ్యస్నపన, పంచగవ్యప్రాసన, యజ్ఞశాల సంప్రోక్షణ, యాగశాల ప్రవేశం వంటి పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయశుద్ధి, యంత్రశుద్ధి, నవగ్రహ ఆరాధన, దీక్షాధారణ, ఋత్విక్‌వరుణం, మండప మంత్ర పుష్పం, తీర్థప్రసాద వితరణ పూజలు నిర్వహించారు. సాయంత్రం అగ్ని ప్రజ్వలన, యాగశాల అలంకరణ, కలశముల ఆవాహనము, అమ్మవారి జలాధివానము, హారతి, పుష్పాదివానం, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ వంటి పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం పోలేరమ్మకు పసుపు, కుంకమార్చనతో, మహిళలు కలశాలతో రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.